నేడు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పర్యటన

వేల్పూర్, జనవరి 11: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నేడు (శుక్రవారం) నిర్వహించనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు బాల్కొండ మండలం నాగపూర్, 11 గంటలకు వేల్పూర్ మండలం అక్లూర్‌లో, మధ్యాహ్నం 3 గంటలకు నాగేంద్రనగర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 4 గంటలకు ఏర్గట్ల మండలం తడ్‌పాకల్‌లో హెల్త్ సబ్‌సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారు.

ఏఆర్ ఎస్సై సస్పెన్షన్

నిజామాబాద్ క్రైం, జనవరి 11 : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏ.ఆర్. (ఆర్మ్‌డ్ రిజర్వ్) విభాగంలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న దేవీసింగ్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు నెలన్నర క్రితం నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ గొడవలో ఏఆర్ ఎస్సై దేవీసింగ్‌పై ప్రత్యర్థులు ఫిర్యాదు చేశారని, ఆయనపై కేసు నమోదైనట్లు నాల్గో టౌన్ ఎస్సై సంజీవ్ తెలిపారు. ఏఆర్ ఎస్సైపై వచ్చిన అభియోగంపై విచారణ చేపట్టగా.. వాస్తవాలు ఉన్నట్లు గుర్తించి, నివేదికను రెండు రోజుల క్రితం సీపీ కల్మేశ్వర్‌కు సంబంధిత విచారణ అధికారి సమర్పించినట్లు తెలిసింది. దీంతో సదరు ఏఆర్ ఎస్సై దేవీసింగ్‌పై శాఖా పరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

రూ. 1.50 లక్షల ఎల్ వోసీ అందజేత

నిజామాబాద్ క్రైం, జనవరి 11 : నిజామాబాద్ నగరంలోని మిర్చి కంపౌండ్ ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్ ఆరోగ్యం బాగాలేనందున చికిత్స నిమిత్తం సహాయం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను సంప్రదించారు. దీంతో ఆయన తన కార్యాలయంలో నవీన్‌కుమార్ కుటుంబీకులకు రూ.1.50 లక్షల ఎల్‌వోసీని శుక్రవారం అందజేశారు. బాధిత కుటుంబం ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

ఆటో, ఇటుక లారీ ఢీ : పలువురికి గాయాలు

మోపాల్ (ఖలీల్‌వాడి), జనవరి 11 : మోపాల్ మండలం కంజరలో గురువారం ఇటుక లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్‌తో పాటు లారీలోని ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ తెలిపారు. సిర్పూర్ గ్రామానికి చెందిన శేఖర్ ఆటోలో కంజర గ్రామశివారులోని శార్వాణి పాఠశాలకు విద్యార్థులను వదిలి వస్తున్నాడు. మోపాల్ నుంచి కంజర వైపు ఇటుక లోడ్‌తో వేగంగా వెళ్తున్న లారీడ్రైవర్ కృష్ణ.. గమనించక ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ శేఖర్, లారీడ్రైవర్ కృష్ణతోపాటు ఇటుకలపై కూర్చున్న సుశీల్‌దేవ్, మహానంద్, గుడ్డు పుటేల్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో జిల్లా దవాఖానకు తరలించారు. గుడ్డు పుటేల్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆటోడ్రైవర్ శేఖర్ తండ్రి సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కూటీపై నుంచి పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, జనవరి 11 : స్కూటీపై నుంచి కింద పడడంతో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునిపల్లి గ్రామానికి చెందిన గుడ్ల సురేశ్ (49) ఆర్మూర్‌లోని ఎస్‌బీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మునిపల్లిలో ఓ అంత్యక్రియలకు హాజరై గురువారం సాయంత్రం తిరిగి వెళ్తుండగా.. మునిపల్లి శివారులోని కోల్డ్ స్టోరేజీ వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సురేశ్ తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి మేనల్లుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీ కొని మహిళ ..

ఆర్మూర్‌టౌన్, జనవరి11: ఆర్మూర్ మండలంలోని చేపూర్ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన సురంపల్లి చంద్రకళ (33) కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిందని ఎస్‌హెచ్‌వో సురేశ్ తెలిపారు. ఎస్‌హెచ్‌వో కథనం మేరకు.. చంద్రకళ గురువారం ఉదయం పెర్కిట్ నుంచి ఆటోలో వెళ్లి చేపూర్ వద్ద దిగి రోడ్డు దాటుతోంది. అదేసమయంలో హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొట్టి ఓవైపు ఒరిగిన బస్సు

డివైడర్‌ను ఢీకొని ఓ వైపు ఒరిగిన ఆర్టీసీ బస్సు

సిరికొండ, జనవరి 11 : సిరికొండ శివారులోని బొడ్డు మామిడిచెరువు సమీపంలో సిరిసిల్ల డిపో ఆర్టీసీ బస్సుకు తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం బొడ్డు మామిడి చెరువు మూల మలుపు వద్ద బస్సు వెనకాల వస్తున్న కారు ఎడమవైపు నుంచి ఓవర్ టేక్ చేయడంతో బస్సుకు కారు తగిలింది. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సును కుడివైపు తిప్పడంతో బస్సు రోడ్డుపక్కకు దూసుకెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి..ఒకవైపు ఒరిగి ఆగిపోయింది. పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో బస్సులో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

‘హరితహారం’ లక్ష్యసాధనకు కృషిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 11 : తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సీపీ కల్మేశ్వర్, డీఎఫ్‌వో వికాస్‌మీనాతో కలిసి గురువారం హరితహారం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఆయా శాఖల వారీగా హరితహారం కింద నాటాల్సిన మొక్కలకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రతిపాదనలు రూపొందించారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేందుకు చొరవ చూపాలని సూచించారు. 2023-24 వార్షిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాల సాధన కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. హరితహారం అమలుతీరును పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. రోడ్లకిరువైపులా ఖాళీ ప్రదేశాల్లో నాటిన మొక్కలను గమనించి, వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. మొక్కలకు జియో ట్యాగింగ్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని సూచించారు. పోలీసు శాఖకు మొక్కలు పెంచేందుకు వీలుగా స్థలం లేనందున, నగర శివారులో 5 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాను కేటాయిస్తామని, ఆ స్థలంలో మొక్కలు నాటేందుకు చొరవ చూపాలని డీఎఫ్‌వో వికాస్‌మీనా కోరారు. నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు డీసీపీ జయరాం, ప్రొబేషనరీ ఐపీఎస్ బి.చైతన్య, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న ధైర్యసాహసాలు అనన్య సామాన్యం

నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 11 : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్యసాహసాలు అనన్య సామాన్యమైనవని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కీర్తించారు. కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న 208 జయంతిని గురువారం అధికారికంగా నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేనాడు ప్రాంతంలో జన్మించిన ఓబన్న.. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి జరిపిన సాయుధపోరులో సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్, వివిధ సంఘాల ప్రతినిధులు దండి వెంకట్, వెంకటేశ్, నగేశ్, శంకర్, బుస్సా ఆంజనేయులు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, వివిధ సంఘాల ప్రతినిధులు

జాతీయస్థాయి నెట్‌బాల్ టోర్నీలో విద్యార్థికి సిల్వర్‌మెడల్

మాక్లూర్, జనవరి 11: గుత్ప ఉన్నత పాఠశాల విద్యార్థి భార్గవ్ 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయస్థాయి అండర్-14 నెట్‌బాల్ టోర్నమెంట్‌లో ద్వితీయ బహుమతి సాధించాడని హెచ్‌ఎం ధృపతి కుమార్ గురువారం తెలిపారు. జనవరి 3 నుంచి 10 వరకు న్యూఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొని సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. సర్పంచ్ చిన్నయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రమేశ్, పీఈటీ సునీల్ విద్యార్థిని అభినందించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కమ్మర్‌పల్లి, జనవరి 11: ఉప్లూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు దివ్య, సుమలత రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మాధురి గురువారం తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు ఆసిఫాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను హెచ్ఎం రాజన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థినులు

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

ఇందల్వాయి, జనవరి 11 : డిచ్‌పల్లి మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని పత్తిరి సతీశ్ (18) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్ గ్రామానికి చెందిన పత్తిరి సతీశ్ గురువారం సాయంత్రం రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా.. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. సతీశ్ పైనుంచి బస్సు టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సు డ్రైవర్ నాశెట్టి రవి వేగంగా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో.. స్థానికులు కేఎన్ఆర్ గార్డెన్ వద్ద అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ పోలీసులకు లొంగిపోయాడు. మృతుడి నానమ్మ భూమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్ ప్రభుత్వ కళాశాలలో చేరాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి11: 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు వచ్చే సంవత్సరం పట్టణంలోని పిప్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.నర్సయ్య సూచించారు. జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.

హసాకొత్తూర్‌లో ఆర్డీవో విచారణ

ఇందిరమ్మ ప్లాట్లను పరిశీలిస్తున్న ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్

కమ్మర్‌పల్లి, జనవరి 11: హసాకొత్తూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని, చెరువులు, కుంటలు, కబ్జా అవుతున్నాయని అదే గ్రామానికి చెందిన పాలెపు రాజేశ్వర్ ప్రజాదర్బార్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్ గురువారం హసాకొత్తూర్‌కు వచ్చి విచారణ చేపట్టారు. ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్లను పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. చెరువులు, కుంటలను సర్వే చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శరత్‌కుమార్ ఉన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

శక్కర్‌నగర్, జనవరి 11: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి సూచించారు. గురువారం బోధన్ పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, కంప్యూటర్ ఆన్‌లైన్ కేంద్రం డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పైప్‌లైన్‌కు లీకేజీలు

మోర్తాడ్, జనవరి11: మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో చెరువులు నింపి సాగునీటి ఇబ్బందులు తీర్చాలని నిర్మించిన హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. తిమ్మాపూర్, పాలెం చెరువులను నింపేందుకు పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తుండగా గురువారం ఉదయం తిమ్మాపూర్ శివారులో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. రైతులు, సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి గమనించి అధికారులకు తెలియజేశారు. దీంతో వారు ఎత్తిపోతల మోటరును ఆఫ్ చేయించారు. ఈ పథకానికి స్టీల్‌పైపులు వేస్తే లీకేజీలు ఉండవని అందుకోసం రూ.150కోట్లు కేటాయించాలని గత కేసీఆర్ ప్రభుత్వానికి తెలిపారు. అందుకు సానుకూలంగా కేసీఆర్ స్పందించారని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఎన్నికలకు ముందు తెలిపారు. నిధులు మంజూరైతే లీకేజీల సమస్య తప్పుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఎత్తిపోతలను బాగుచేసేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి, జనవరి 11 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7వ నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ఇందల్వాయి టీఎస్ మోడల్ స్కూల్‌లో..

ఇందల్వాయి, జనవరి 11 : మండలంలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీల భర్తీ కోసం ఏప్రిల్ 4న ప్రవేశపరీక్ష ఉంటుందని, ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ విద్యార్థులకు రూ. 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ విద్యార్థులకు రూ. 125 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టాపల్లి క్రీడాకారులు

ఇందల్వాయి, జనవరి 11 : 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-14 బాలబాలికల టోర్నమెంట్‌కు జడ్పీహెచ్ఎస్ -మిట్టాపల్లి క్రీడాకారులు మెండె శ్రితిక, పురం మణితేజ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుశీల్‌కుమార్ తెలిపారు. ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సొప్పరి వినోద్, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాఘవేందర్, బాలరాజ్, శ్రీధరాచార్యులు, వ్యాయామ ఉపాధ్యాయుడు మార్కంటి గంగామోహన్ గురువారం అభినందించారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

సిరికొండ, జనవరి 11 : పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. జాతీయ తపాలాశాఖ ఆధ్వర్యంలో గతేడాది అక్టోబర్‌లో పిలాటలీ ఉపకార వేతనాల కోసం ‘దీన్ దయాళ్ స్పార్శ్ యోజన’ జనరల్ నాలెడ్జ్ పోటీపరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చి, ప్రాజెక్టు లెవల్‌కు ఎంపికైన సత్యాశోధక్ విద్యార్థులను గురువారం అభినందించారు. వీరు మహాత్మాగాంధీ కమ్యూనికేషన్ అభివృద్ధి, ఇస్రో, భారత స్వాతంత్ర్యోద్యమం, భారతదేశ రక్షణలో సైనికుల పాత్ర తదితర అంశాలపై తపాలాశాఖ ముద్రించిన స్టాంపులను సేకరించి రూపొందించిన ప్రాజెక్టును ఎంఈవో పరిశీలించారు. విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

బోధన్, జనవరి 11: పట్టణంలో ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. పట్టణంలోని తట్టికోట్‌లోని రెడ్డికా కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన ఈ పోటీలకు ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి హాజరయ్యారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు గొల్ల నర్సక్క, పట్టణ అధ్యక్షురాలు బిపాషా బేగం, జిల్లా నాయకురాలు రెహానా బేగం, పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి పీజీ, ఇంటిగ్రేటెడ్ కోర్సుల పరీక్షలు

ఇందల్వాయి, జనవరి 11 : టీయూ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలకు పీజీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులకు రెగ్యులర్, సెమిస్టర్ పరీక్షలు ఈనెల 23 నుంచి నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఉంటాయని పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ.. కొన్ని కారణాల వల్ల 23వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, పీజీ 3వ సెమిస్టర్ పరీక్షలు, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల (ఏపీఈ/పీసీహెచ్/ఐఎంబీఏ) 5, 7, 9వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఉంటాయని వివరించారు.

వాహనాల అద్దాలు ధ్వంసం

ఆర్మూర్‌టౌన్,జనవరి11: పట్టణంలోని పెద్దబజార్, చిన్నబజార్‌లో ఇండ్ల సమీపంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన మూడు వాహనాలు అద్దాలను బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. చిన్నబజార్‌లో ఓ కారు, పెద్ద బజార్‌లో ఆటో, కారు అద్దాలు ధ్వంసం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై గంగాధర్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్, జనవరి11: పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలని, విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలని, మెనూ ప్రకారం భోజనం అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంకాపూర్‌లో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని ఆయన స్వగృహంలో గంగాపుత్ర సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నిజామాబాద్ జిల్లా తెలంగాణ గంగాపుత్ర సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

దివ్యాంగురాలికి చెక్కు అందజేత

జక్రాన్‌పల్లి, జనవరి 11: తొర్లికొండ గ్రామానికి చెందిన గంగాజమున అనే దివ్యాంగురాలికి వంద శాతం సబ్సిడీపై రూ. 50 వేల చెక్కును ఎంపీపీ కుంచాల విమలారాజు గురువారం అందజేశారు. ఉమెన్స్, చిల్డ్రన్ డిసెబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్స్ తరపున కిరాణ, జనరల్ స్టోర్స్ నిర్వహణ కోసం చెక్కును అందజేసినట్లు ఎంపీపీ తెలిపారు. ఎంపీడీవో బ్రహ్మానందం, మండల కో-ఆప్షన్ సభ్యుడు బుల్లెట్ అక్బర్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

బాల్కొండ, జనవరి 11: ఎంఈవో కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీల సమన్వయ సమావేశాన్ని ఎంఈవో బట్టు రాజేశ్వర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులతో మధ్యాహ్న భోజన కమిటీ వేయాలని, వంట ఏజెన్సీకి బియ్యంతోపాటు ఇతర సరుకులు విద్యార్థుల కమిటీ సమక్షంలో తూకం వేసి ఇస్తూ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

యూనియన్ బ్యాంక్‌పై సంగవ్వ విజయం

- రూ.15వేల నష్టపరిహారం, రూ. 3 వేలు చెల్లించాలని తీర్పు

నిజామాబాద్ లీగల్, జనవరి 11 : కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలకేంద్రానికి చెందిన దేమి సంగవ్వ టెంట్ హౌస్ స్వయం ఉపాధి కోసం కామారెడ్డి జిల్లా షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ద్వారా రుణం కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ.. ఆమెకు అనుకూలంగా రూ. 6 లక్షల రుణ సదుపాయం కల్పిస్తూ చేస్తూ ప్రొసీడింగ్‌ను 29 జనవరి, 2018న జారీ చేసింది. తాడ్వాయిలోని ఆంధ్రా బ్యాంకు (ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)కు ఉత్తర్వులు పంపించారు. రూ. 6లక్షల లోన్‌లో ప్రభుత్వ సబ్సిడీ రూ. 3.60 లక్షలుగా నిర్ధారించారు. బ్యాంకర్ ఆదేశాల మేరకు సంగవ్వ రూ.1.5 లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసింది. బ్యాంకర్ జనవరి 3, 2020న సంగవ్వ పేరున కాకుండా ఇతరుల పేరిట రూ. 6 లక్షలకు గాను రూ. 3లక్షల బ్యాంక్ చెక్కును జారీ చేశారు. బ్యాంక్‌వారు ఆమె ఖాతా నుంచి మూడు వాయిదాలుగా రూ. 6,660 లోన్‌కు బదిలీ చేసుకున్నారు. ఎన్నిసార్లు విన్నవించుకున్న సంగవ్వకు లోన్ ఇవ్వకపోవడంతో ఆమె నిజామాబాద్ వినియోగదారులు వివాదాల పరిష్కార కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నోటీసులు అందుకున్న బ్యాంకు అధికారులు లోన్ మంజూరు చేయకపోవడంలో తమ పొరపాటు లేదని జవాబు దాఖలు చేశారు. సంబంధిత పత్రాలను పరిశీలించి సంగవ్వకు రూ. 6లక్షల లోన్ మంజూరీ చేయాలని కమిషన్ తీర్పు వెలువరించింది. లోన్ ఇవ్వకున్నా ఆమె బ్యాంకు ఖాతా నుంచి మూడు వాయిదాల డబ్బులు కోత విధించిన రూ. 6,660 డబ్బులను 9 శాతం వడ్డీతో చెల్లించాలని, సంగవ్వను ఆర్థిక, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ. 15 వేలు పరిహారం చెల్లించాలని, రూ.3వేలు ఖర్చులకు చెల్లించాలని కమిషన్ సభ్యుడు నాగేశ్వర్‌రావు తీర్పు రాయగా, కమిషన్ అధ్యక్షురాలు సువర్ణ జయశ్రీ, మరో సభ్యురాలు సుమా రవీందర్‌రావు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. తమ తీర్పు ప్రతి స్వీకరించిన 45 రోజుల్లో కమిషన్ ఆదేశాలు అమలు చేయాలని సూచించింది.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-II, Dist.Nizamabad agreed to accord Loan to Borrower: **Alwala Srinivas** S/o Balaraj, Age 48 Yrs, Occ:Business, R/o H.No.5-8, Khanapur, Nizamabad (M), Nizamabad (Dist) mortgage of the schedule referred property of **Alwala Sujatha** W/o Srinivas. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatso ever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

All that the Part of Open Plot No.(0 Nil), towards southern side, bearing Survey No. 1056/P2 of Khanapur Village shivar, admeasuring (192.00) Sq.Yards, or (160.53) Sq.Mtrs, out of total area (400.00 Sq.Yards, situated at Khanapoor Village, Mandal and District Nizamabad (Now merged in Municipal Corporation, Nizamabad), under the jurisdiction of Regn.Sub Dist Nizamabad Rural and Regn.Dist Nizamabad [Subject matter of the Regd.Sale Deed Doct No.3033/2018 Dt.06.04.2017 SRO Nizamabad Rural]. **AS BOUNDED BY: North ::** Remaining part of same Open Plot No.(0 Nil) **South ::** Plot of Korva Gangadhar & others **East ::** 12'-0" wide road **West ::** Plot of Kurme Gangamallu.

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad.Cell:98480 94409.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-II, Dist.Nizamabad agreed to accord Loan to Borrower: **Marvadi Gangadhar S/o Linganna,** Age 48 Yrs, Occ:Business, R/o H.No.2-72, Thanakalan (V) Yedapally (M), Nizamabad (Dist) mortgage of the schedule referred property of **Marvadi Sarala** W/o Marvadi Gangadhar. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

All that the Existing RCC roofed House bearing G.P No.2-80 (Assessment No.290) situated at Thanakalan Village of Yedapally Mandal, Nizamabad District, within the limits of Gram Panchayat Thanakaolan, under the jurisdiction of Regn.Sub Dist Bodhan and Regn.Dist Nizamabad [Subject matter of the Regd.Sale Deed Doct No.2872/2023 Dt.27.04.2023 SRO Bodhan]. Admeasuring Total Plot area 30'-0" X 38'-0" = 1140.00 Sq.fts or 126.66 Sq.Yds or 105.90 Sq.Mtrs RCC Roofed Plinth area 950.00 Sq.fts **AS BOUNDED BY: East ::** G.P.Road **West ::** House of Neela Rajendhar **North ::** House of G.Sailu **South ::** House of G.Srinivas

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad.Cell:98480 94409.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★My Old Surname/Name was **GAPPALA NAVEEN KUMAR** now my new Surname/ Name as **GAPPALA NAVEEN** H.No.1-94, G.G.Nadkuda, (M) Donkeshwar, (D) Nzb.
NTZ-318896

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శివాజీ మహారాజ్ విగ్రహంపై స్టిక్కర్

- చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

నిజామాబాద్ క్రైం, జనవరి 11 : నగరంలోని రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న శివాజీ మహారాజ్ విగ్రహంపై గుర్తు తెలియని వ్యక్తులు ఓ మత సంస్థకు చెందిన స్టిక్కర్‌ను అతికించారు. ఈ విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ బాధ్యులు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబుకు గురువారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. విగ్రహంపై స్టిక్కర్ అతికించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



శివాజీ విగ్రహానికి అతికించిన స్టిక్కర్

పురుషులతో మహిళలను సమానంగా చూడాలి

నవీపేట/ మాక్లూర్, జనవరి 11: పురుషులతో పాటు మహిళను సమానంగా చూడాలని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ స్వప్న పేర్కొన్నారు. గురువారం నవీపేటలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన బేటీ పడావో- బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీపీడీవో స్వర్ణలత, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లోని రైతు వేదికలో బేటీపడావో-బేటీ బచావో కార్యక్రమంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్లు శ్రీప్రియ, వరలక్ష్మి, సునీత, రాంబాబు, ఏపీఎం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వే గేటు

మాక్లూర్, జనవరి11: అడవిమామిడిపల్లి వద్ద గురువారం రైల్వే గేటు మొరాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గురువారం మధ్యాహ్నం రైలు వస్తున్న సందర్భంగా సిబ్బంది గేటు వేశారు. రైలు వెళ్లిన అనంతరం గేట్లు పైకి లేవకపోవడంతో వాహనాలు 2గంటల పాటు ఆర్మూర్, నిజామాబాద్ వైపు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. తరుచూ ఇలాగే జరుగుతోందని రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఉన్నతిపై ఉపాధ్యాయులకు సూచనలు

మోర్తాడ్, జనవరి4: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నతి కార్యక్రమాన్ని అమలు చేసే విధానంపై ఉన్నతి రాష్ట్ర రిసోర్స్ పర్సన్ లక్ష్మీనాథం గురువారం మోర్తాడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయాలపై తనిఖీలు

నిజామాబాద్ క్రైం, జనవరి 11 : నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పతంగుల దుకాణాల్లో ఫారెస్ట్ శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. నార్త్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు ఆధ్వర్యంలో నెహ్రూపార్క్, పెద్ద పోస్టాఫీస్ ప్రాంతంలోని దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. చైనా మాంజాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు నోటీసులు జారీ చేశారు. తనిఖీ చేసిన వారిలో సెక్షన్ ఆఫీసర్లు ప్రతాప్, జహూర్, భాస్కర్, బీట్ ఆఫీసర్లు నవీన్, ప్రవీణ్, స్ట్రైకింగ్ ఫోర్స్‌సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలి

శక్కర్‌నగర్, జనవరి 11: కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు. బోధన్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో వివిధ కళాశాలల యాజమాన్యాలతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని, వారు చెడు మార్గంలో వెళ్లకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, చెడు వ్యసనాలు లేని నలుగురు విద్యార్థులు, ఇద్దరు ఎన్‌జీలతోపాటు పోలీస్ శాఖ నుంచి ఒకరితో కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాల గురించి సమాచారం తెలిస్తే కమిటీలోని పోలీసుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు వీరయ్య, శ్రీనివాసరాజు వివిధ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వరంగ సంస్థ
నిజామాబాద్ శాఖ (32770)
 # 6-13-209 (గ్రౌండ్ ఫ్లోర్), శివాజీ చౌక్ రోడ్, నామ్‌దేవ్‌వాడ, శ్రద్ధానంద్ గంజ్ దగ్గర, నిజామాబాద్-503001.

సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

దిగువ వారికి:
శ్రీ ఆకుల శ్రీనివాస్, తండ్రి. శ్రీ ఆకుల రాజలింగం, H.No. 4-4-58/82, RP రోడ్, నిజామాబాద్-503001,
శ్రీమతి పుట్టకోట ఊర్మిళ, భర్త. శ్రీ P.గంగాధర్, G.No. 6-16-147/1, అంబేద్కర్ కాలనీ, నిజామాబాద్-503002.
సర్/మేడమ్,

విషయం: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్షన్ నోటీసు-మా నుండి మీరు వినియోగించుకున్న రుణ సదుపాయాలు NPAగా వర్గీకరించబడిన వాటికి సంబంధించి.

దిగువ తెలిపిన మీ ఖాతా నంబర్ - 288830100004003 బకాయి/వాయిదా/వడ్డీ తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైన కారణంగా 29-12-2023 నాటికి NPAగా వర్గీకరించబడినదని మీకు మేము తెలియజేస్తున్నాము. దిగువ చూపిన ప్రకారం మీ ఖాతా/ఖాతాలలో మొత్తం **రూ. 11,85,281.20 (పదకొండు లక్షల ఎనభై ఐదు వేల రెండు వందల ఎనభై ఒక్క రూపాయల ఇరవై పైసలు మాత్రమే)** బకాయిగా ఉన్నది.

పూర్తి బకాయి మొత్తం: రూ.11,85,281.20 (పదకొండు లక్షల ఎనభై ఐదు వేల రెండు వందల ఎనభై ఒక్క రూపాయల ఇరవై పైసలు మాత్రమే).

పలుమార్లు మేము డిమాండ్ చేసినప్పటికీ మీ ఖాతాలోగల రుణ బకాయి నిమిత్తం ఏ విధమైన మొత్తాన్ని మీరు చెల్లించలేదు మరియు మీరు మీ బకాయిలను చెల్లించలేదు.

ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా మీ పూర్తి రుణ బకాయిలను చెల్లించాల్సిందిగా మరియు మీ ద్వారా ఎగ్జిక్యూట్ చేయబడిన రుణ డాక్యుమెంట్ల నియమ నిబంధనల ప్రకారం నెలవారీ వాయిదాలతో పై టేబుల్‌లో తెలిపిన రేట్ వంతున వడ్డీతో పాటుగా **రూ. 11,85,281.20 (పదకొండు లక్షల ఎనభై ఐదు వేల రెండు వందల ఎనభై ఒక్క రూపాయల ఇరవై పైసలు మాత్రమే)**ల మొత్తాన్ని చెల్లించాల్సిందిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం మిమ్మల్ని కోరడం జరిగింది. విఫలమైనచో సదరు చట్టం క్రింద ఇవ్వబడిన ఏదేని లేదా అన్ని హక్కుల్ని వినియోగించడం ద్వారా బ్యాంక్ పేరున మీ ద్వారా కల్పించబడిన దిగువ తెలిపిన సెక్యూరిటీల అమలుకు మేము కట్టుబడి ఉన్నాము.

స్థిరాస్తి వివరణ

నిజామాబాద్, అంబర్‌పేట్ కాలనీలో గల మున్సిపల్ నెం. 4-4-61 కలిగిన RCC రూఫ్డ్ కమర్షియల్ బిల్డింగ్ యావత్తూ, విస్తీర్ణం 15.77 చ.గజాలు లేదా 13.18 చ.మీటర్లు, గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 135 చ.అడుగులు మరియు **సరిహద్దులు:** తూర్పు: కామన్ లేన్, పడమర: A.నర్సింగ్ రావు ఇల్లు, ఉత్తరం: శ్రీ A.శివప్రసాద్ అదే ఇంటిలో భాగం, దక్షిణం: పొరుగువారి స్థలం.

1) ఒక వేళ 60 రోజుల్లోగా బకాయిలను చెల్లించుటలో మీరు విఫలమైనచో మరియు ఒక వేళ ఈ చట్టం క్రింద తన హక్కులన్నింటినీ బ్యాంక్ వినియోగించుకున్న తర్వాత కూడా సెక్యూర్డ్ ఆస్తుల యొక్క విక్రయ లావాదేవీల ద్వారా పూర్తి రుణ బకాయి వసూలు కాని యెడల, మీ నుండి మిగిలిన మొత్తం యొక్క రికవరీ కొరకు న్యాయస్థానం/డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు మీపై మేము తగిన విధంగా చట్టబద్ధమైన చర్యను చేపట్టడం జరుగుతుంది.

2) చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారం బ్యాంక్ యొక్క అనుమతి లేకుండా వ్యాపారం యొక్క సాధారణ పద్ధతి మినహాయించి పై సెక్యూరిటీలను విక్రయించుట లేదా వాటితో లావాదేవీ నిర్వహించుట నుండి మీరు నిరోధించబడుతున్నారని గమనించాల్సిందిగా మిమ్మల్ని కోరడమైనది. ఈ సెక్షన్ యొక్క ఏదేని ఉల్లంఘన తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.

3) సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి SARFAESIలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(8) నిబంధనలు గమనించవల్సిందిగా మిమ్మల్ని కోరడమైనది.

తేది: 30-12-2023, ప్రదేశం: నిజామాబాద్ | చీఫ్ మేనేజర్/అధీకృత అధికారి